www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 03 | నవంబర్ | 2026
పేజీలు : 8

42.195 కి.మీ మారథాన్ పూర్తిచేసి..మృత్యుఒడికి..!



-రావినూతల యువకుడు కొమ్మినేని గోపి మృతి

ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన కొమ్మినేని గోపి(36) హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన హైటెక్స్ మారథాన్‌లో 42.195 కిలోమీటర్ల పూర్తి చేసి పతకాన్ని అందుకున్నారు. అయితే పరుగు పూర్తి చేసిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మారథాన్ లక్ష్యాన్ని చేరుకున్న ఆనందం ఎంతోసేపు నిలవకుండానే ఆయన అకాల మరణం చెందడంతో రావినూతల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం స్వస్థలం రావినూతలలో గోపి అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతదేహానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాధం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆయా రాజకీయపార్టీల నాయకులు, గ్రామస్థులు తదితరులున్నారు.

బదిలీ.. నిలుపుదల...





-అసలు సంగతేంటి సారూ
-శృతిమించుతున్న రాజకీయ పైరవీలు

ప్రజాపక్షం/ఖమ్మం : పాలన పరమైన వ్యవహారాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోతుంది. అమాత్యులకే కాదు స్థానిక అధికార పార్టీ నేతలకు నచ్చకపోయినా అధికారులపై బదిలీ వేటు పడుతుంది. కొందరు మండల అధికారులు స్థానిక నాయకులతో మిలాఖత్ అయి వారు చెప్పింది చేస్తే బదిలీలు నిలిచిపోతున్నాయి. ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ఈ తంతు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. బోనకల్ మండల తహసీల్దార్ సుధాకర్‌ను గతంలో ఒకసారి బదిలీ చేశారు. ఆయన పై ఆరోపణలు వచ్చిన సందర్భంలోనే బదిలీ చేశారన్న ప్రచారం జరిగింది. ఏమి జరిగిందో కానీ రెండు రోజుల తర్వాత యధాస్థానానికి తిరిగి వచ్చారు. ఆయన బదిలీ నిలుపుదలపై అప్పుడు చర్చ సాగింది. ఆరోపణలు వచ్చిన వ్యక్తిని బదిలీ కాకుండా నిలుపుదల చేయడం రాజకీయ జోక్యంతోనే జరిగిందని ఆరోపణలు వినవచ్చాయి. తిరిగి నాలుగు రోజుల క్రితం బోనకల్ తహసీల్దార్‌గా ఉన్న సుధాకర్‌ను కారేపల్లికి బదిలీ చేశారు. కారేపల్లిలో ఉన్న ఓరుగంటి వెంకటేశ్వర్లును బోనకల్‌కు బదిలీ చేశారు.

మిగతా 2లో..

జిపిఒల విధులపై పర్యవేక్షణేది?

- గాడి తప్పుతున్న గ్రామ పాలన
- సమయ పాలనకు తిలోదకాలు
- సర్టిఫికెట్ల కోసం ప్రజల ప్రదక్షిణలు
- ఫోన్ల స్పందన కరువు, కేటాయించిన ప్రాంతాల్లో ఉండని వైనం
- జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలంటున్న ప్రజలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : సాక్షత్తు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇలాకాలోని ఖమ్మంరూరల్ మండలలోని కొందరు జీపీఓలు ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారు. ఆశించిన స్థాయిలో పనిచేస్తోందా? ప్రభుత్వ ఉత్వర్వుల్లో నిర్దేశించిన విధులు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? సమయపాలన పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నారు. అంతేకాకుండా పనితీరుపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుండగా, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం,వారికి గ్రామాల్లో కేటాయించిన కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడం. ఫోన్ చేసినా స్పందించకపోవడం వంటి సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2025 మార్చి 22న జీఓ ఎంఎస్ నెం.41 ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 10,954 గ్రామ పాలనాధికారుల పోస్టులను ఏర్పాటు చేసింది. అనంతరం మార్చి 27న జీఓ ఆర్‌టీ నెం.129 ద్వారా నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలు, విధులను నిర్దేశించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం గ్రామ ఖాతాల నిర్వహణ, వివిధ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన విచారణలు, ప్రభుత్వ భూములు, చెరువులు, నీటి వనరుల ఆక్రమణలపై పరిశీలన, భూ వివాదాల విచారణ, భూ సర్వేలకు సహకారం,

మిగతా 2లో..

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



-రూ.18 వేలు ఇవ్వకుంటే పోరాటం తప్పదు
- సిపిఐ నేత కూనంనేని
-ఐసిడిఎస్ సమ్మె, కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల వేళ సీఎం ఇచ్చిన రూ.18,000 వేతన పెంపు హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలతో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రగతిలో భాగస్వాములవుతూ మతాశిశు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ శిశు, గర్భిణుల మరణాల నివారణకు అంగన్‌వాడీలు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. మార్కెట్లో నిత్యావసర

మిగతా 2లో..



జిపిఓల విధులపై పర్యవేక్షణేది?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు, ఎన్నికల విధులు, విపత్తుల సమయంలో అత్యవసర సేవలు అందించడం వంటి బాధ్యతలు గ్రామ పాలనాధికారులకు అప్పగించారు. ఇంటి స్మృతమైన బాధ్యతలు కలిగిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. కానీ ఖమ్మం రూరల్ మండలంలో కొందరి పనితీరుపై వస్తున్న ఫిర్యాదులు ఈవ్యవస్థ అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

సమయ పాలన ఎక్కడ?

ప్రభుత్వ ఉద్యోగుల విధుల్లో సమయపాలన అత్యంత కీలకం. 2026 జూన్‌లో ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ పనివేళలు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయని ప్రస్తావించారు. అయితే ఖమ్మంరూరల్ మండలంలో కొందరు జీపీఓలు సమయపాలన పాటించడం లేదని, కార్యాలయాలకు ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపులా వస్తారని ఎక్కడ అందుబాటులో ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పని నిమిత్తం కార్యాలయాలకు వెళ్లినప్పుడు అధికారులు కనిపించకపోవడం. ఫోన్ చేసినా స్పందించకపోవడం, వల్ల ప్రజలు పలుమార్లు ఊరు నుంచి ఖమ్మానికి తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో విధుల్లో భాగంగా పనిచేయడం సహజమే కానీ దాన్ని ఆసరా చేసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా విధుల్లో ఎటువంటి సమయపాలన ఉండటం లేదని, వారు వచ్చిందే సమయపాలనగా మారిపోయిందంటున్నారు.

కేటాయించిన క్లస్టర్‌లో విధుల నిర్వహణ ఏదీ?

జీపీఓలకు పోస్టింగ్‌లు యాదృచ్ఛికంగా కాకుండా నిర్దిష్ట ప్రాంతాలు, క్లస్టర్ల ఆధారంగా కేటాయించారు. అంటే ప్రతి అధికారి తనకు అప్పగించిన ప్రాంత పరిధిలో ప్రజలకు సేవలు అందిస్తూ, క్షేత్రస్థాయి బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే ఖమ్మంరూరల్ మండల జీపీఓలు మాత్రం వారికి కేటాయించిన క్లస్టర్లలో కాకుండా కేవలం ఖమ్మం నగరంలో రెవెన్యూ కార్యాలయంలోనే ఉంటుండటం గమనార్హం. దీంతో చింతపల్లి, కాచిరాజుగూడెం, కస్నాతండా, మంగళగూడెంతో పాటు తదితర దూర గ్రామాలు, ఏదులాపురంమున్సిపాలిటీలోని శివారు ప్రాంతాల ప్రజలకు సర్టిఫికెట్ల కోసం ఖమ్మం కార్యాలయం వరకు రావడం భారంగా మారింది.

సర్టిఫికెట్ల విచారణలో జాప్యం..

ప్రజలకు వసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం సంబంధిత విచారణలు నిర్వహించడం జీపీఓల బాధ్యతల్లో ఒకటి. కానీ కొందరు జీపీఓలు ఈ ప్రక్రియలో జాప్యం కనబరుస్తున్నారని, మామూళుగా చూసుకుంటే అందుబాటులో లేకున్నా ఫోన్‌తోనే పని కానిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ మామూళుగా చూసుకోలేకపోతే పలుమార్లు క్లస్టర్, ఖమ్మంలోని కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. కానీ మట్టి తవ్వకాలు భూ వ్యవహారాల వంటి వాటిపై తక్షణమే స్పందిస్తూ మామూళుగా తీసుకుంటున్నారని కొందరిపై అభియోగాలు వినపడుతున్నాయి. కాచిరాజుగూడెం జీపీఓ పరిధిలోని ఈ వ్యవహారంపై గతంలో చర్చనీయాంశం అయ్యింది.

అవసరంగా అకస్మిక తనిఖీలు

ఖమ్మంరూరల్ మండలంలో కొందరు జీపీఓల పనితీరు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపించాలని ప్రజలు కోరుతుఆన్నరు. ప్రతి అధికారికి కేటాయించిన క్లస్టర్, గ్రామాల వివరాలు, విధులు నిర్వహణ కేంద్ర, హాజరు రికార్డులు, క్షేత్రస్థాయి పర్యటనల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, పరిష్కరించిన ఫిర్యాదులపై నివేదికలు తెప్పించుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. అలాగే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అధికారులు విధుల సమయంలో అందుబాటులో ఉన్నారా? ప్రజలతో ఎలా వ్యవహరిస్తున్నారు? దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలిస్తున్నారా? అనే అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరుతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే సంబంధిత సర్వీస్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ పాలనాధికారుల పనితీరుపై వస్తున్న ఫిర్యాదులకు జిల్లా యంత్రాంగం ఎలాంటి సమాధానం చెబుతోంది? ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అన్నది వేచి చూడాలి.

బదిలీ.. నిలుపుదల...

(మొదటిపేజీ తరువాయి)

ఓరుగంటి వెంకటేశ్వర్లు శనివారం నాడే కారేపల్లిలో రిలీవ్ అయి బోనకల్‌లో బాధ్యతలు తీసుకునేందుకు వచ్చారు. కానీ సుధాకర్ రిలీవ్ కాలేదు. ఏమి రాజకీయం చేశారో కానీ సుధాకర్ బదిలీ మరోసారి నిలిచిపోయింది. కొందరు కాంగ్రెస్ నేతలతో పాటు తహసీల్దార్ సొంత పైరవీ రెండు సార్లు బదిలీ నిలిచిపోయేందుకు కారణమైందని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇసుక, మట్టి తరలింపుకు సంబంధించి కొందరు స్థానిక నేతలతో చేతులు కలపడం వల్లే ఆయన బదిలీ నిలుపుదలకు కారణమైందని ఆరోపణలు వినవస్తున్నాయి. కూపన్లు లేకుండానే ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక ఎస్ఐ అదుపులోకి తీసుకుంటే ఎటువంటి అనుమతులు లేకపోయినా స్థానిక తహసీల్దార్ ఆ ట్రాక్టర్లను విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై మీడియా ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పలేదు. ఇది జరిగిన రెండు రోజులకే ఆయన బదిలీ జరగడం తిరిగి నిలిచిపోవడం మరోసారి చర్చకు కారణమైంది. తహసీల్దార్‌ను రెండు సార్లు బదిలీ చేసి రెండు సార్లు అదే స్థానంలో కొనసాగించడం శృతిమించిన రాజకీయ పైరవీకి ఉదాహరణగా నిలిచింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంపై పలు ఆరోపణలు వినవస్తున్నాయి. వివిధ ధృవీకరణలకు సంబంధించి వేలాది రూపాయలు వసూలు చేశారని ఆ ధృవీకరణలు పూర్తి కాకపోవడంతో ఒకపక్క డబ్బులు చెల్లించిన వారు ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ బదిలీ నిలుపుదలను మండల ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



(మొదటిపేజీ తరువాయి)

సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న రూ.13 వేల వేతనంతో కుటుంబం బ్రతకడం సాధ్యం కాదని, సామాన్య కార్మికుల వేతనాల పెంపుపై నిర్లక్ష్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారఉ. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, ఎఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాల అద్దెలు, గ్యాస్, ఆరోగ్యలక్ష్మి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రాలకు నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తున్న టెండర్లను రద్దు చేసి శనగలు, కారం, చింతపండు, గుడ్లు నాణ్యమైనవి పంపిణీ చేయాలని, టీచర్లపై బలవంతంగా రుద్దుతున్న బీఎల్‌వో డ్యూటీలను తక్షనమే తొలగించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పీఫ్, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తూ ఆయాలకు కనీసం రూ.10 వేల వేతనం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఖాళీగా ఉన్న గ్రేడ్2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారి తారకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య వేల్పుల మల్లికార్జున్, భూక్యా శ్రీనివాస్, రెడ్డి అరుణ, విజయ, భారతి, సంధ్య, ఇందిర, మీనాకుమారి, కృష్ణకుమారి, సమ్మక్క, చిన్నారి, శ్రీదేవి, సునీత, సరస్వతి, సుజాత, శోభారాణి, గుర్రం వెంకటేశ్వర్లు, ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరులో జాప్యం..!



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సానుకూలంగా స్పందించినప్పటికీ ఇందిరమ్మ కమిటీల సభ్యులు వ్యతిరేకిస్తుండటంతో తనకు ఇల్లు మంజూరు కావడం లేదని హస్నాబాద్ గ్రామానికి తండా నాగమణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిటీ సభ్యులే తనకు ఇల్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నాగమణి భర్త రాము ఐదేళ్ల క్రితం మరణించగా కుమారుడు భారత్(25), కుమార్తె అశ్విత(20) ఉన్నారు. ఇద్దరూ డిగ్రీ చదువుతున్నారు. జీవనోపాధి కోసం ప్రస్తుతం హైద్రాబాద్‌లో నివాసం ఉంటున్న ఆమె స్వగ్రామమైన హస్నాబాద్‌లో ఇంటి స్థలం కొనుగోలు చేసి రేకులు, తాటాలకులతో నిర్మించిన గుడిసెలో నివసిస్తున్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరైతే పక్కా ఇల్లు నిర్మించుకోవచ్చని ఆశిస్తున్నారు. తనకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇల్లు మంజూరు కావడం లేదని నాగమణి పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆమెకు ఇల్లు మంజూరు చేసే అంశంపై పాలకవర్గం సానుకూలంగా స్పందించగా కమిటీ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేయడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కమిటీ సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆర్థిక స్థోమత ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తూ నిజమైన అర్హులను విస్మరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. తన అర్హతను పరిశీలించి నిబంధనల ప్రకారం ఇల్లు మంజూరు చేయాలని నాగమణి అధికారులను కోరుతున్నారు. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుడ్లు పంపిణీ



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారితో పాటు పోషకాహార లోపాలను నివారించేందుకు లక్ష్యంగా తెలంగాణ ఇంటర్మీడియేట్ విద్యాశాఖ చేపట్టిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉడకబెట్టిన గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎదుగుదల దశలో ఉన్నందున వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి సమతులు ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా గుడ్లలో లభించే ప్రొటీన్లు, మిటమిన్లు, ఖనిజ లవణాలు శరీర ఎదుగులకు కండరాల అభివృద్ధికి, రోగనిరోధక శక్తి పెంపునకు ఎంతగానో దోహదపడతాయి పేర్కొన్నారు. విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడంతోపాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కారర్యక్రమాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ములకలపల్లి సర్పంచుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

-అధ్యక్షుడిగా తుర్రం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కల్లూరి కిషోర్



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండల సర్పంచుల సంఘం నూతన 15 మంది కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుర్రం శ్రీనివాసరావు(తిమ్మంపేట), ఉపాధ్యక్షురాలిగా మడకం విజయ(రచ్చన్న గూడెం), కార్యదర్శిగా కల్లూరి కిషోర్(ముత్యాలంపాడు), సహాయ కార్యదర్శిగా గంప సుజాత(మాదారం), కోశాధికారిగా వాడే రాము(గుట్టగూడెం) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా భూక్య ధర్మ(పూసుగూడెం), ఊకే ఆదిలక్ష్మి (వీకే రామవరం), వగ్గెల రాధ(కమలాపురం), రసపుత్ర తిరుపతమ్మ(రామచంద్రాపురం), సోడే చైతన్య(పాత గంగారం), కోర్సా ఆదిలక్ష్మి (మూకమామిడి), తానం పద్మ(చవిటిగూడెం), మడకం రవి(పొగలపల్లి), గడ్డం సుజాత(తాళ్లపాయి), కారం వెంకటేష్(పాత గుండాలపాడు)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు తుర్రం శ్రీనివాసరావు, కార్యదర్శి కల్లూరి కిషోర్ మాట్లాడుతూ సర్పంచులంతా ఐక్యంగా ఉంటూ గ్రామాల అభివృద్ధి, సర్పంచుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధకు సమాచారం ఇవ్వకుండా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రోటోకాల్ పాటించని సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జెడ్‌పీ హైస్కూల్ విద్యార్థుల పతకాల పంట



ప్రజాపక్షం/ఇల్లందు: ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 32వ కరాటే పోటీల్లో ఇల్లందు మండలం విజయల క్ష్మీ నగర్ జెడ్‌పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదు పతకాలు సాధించారు. కరాటే శిక్షకురాలు సనా వద్ద శిక్షణ పొందిన ఎస్‌కే ఆఫ్రా, వట్టం చక్రి స్వర్ణ పతకాలు సాధించగా, వి లవుకిత, వై ధర్వీన్ సిద్ధార్థ, టీ మోక్షశ్రీ రజత పతకాలు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కరాటే శిక్షకురాలు సనాతో పాటు విజేతలను గ్రామ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలోనే విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఐదుగురు విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరువు మండలంగా చింతకానిని ప్రకటించాలి



-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల
-సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజురు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సిపిఐ చింతకాని మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపధ్యంలో చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, గోదావరి జలాలతో బోనకల్ బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు, కుంటలు నింపాలని, రైతు భీమా పునరుద్ధరించాలని, యూరియా యాప్ రద్దు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజురు చేయాలని, వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలకు, దివ్యాంగులు పెన్షన్ రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, మహిళలకు 2500, ఫీజు రియంబర్సుమెంటు బకాయిలు విడుదల చేయాలని, మండలంలో 155 కుటుంబాలకు మంజూరైన దళితబందు నిధులు గ్రౌండింగ్ చేయాలని, అర్హత ఉన్న 3800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు తొమ్మిదిరకాల నిత్యావసర సరుకులతో పాటు ప్రతి ఒక్కరికి 12 కేజీల రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు 100 అడుగుల రహదారి విస్తరణలో ఇండ్లకు నష్టం కలుగకుండా చూడాలని, చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కరుణశ్రీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు పర్చా రామచంద్రరావు, నారపోగు హేమ, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, నాయకులు పగిడిపల్లి ఏసు, దొబ్బల వెంగళరావు, పదిమల వెంకటనర్సయ్య, గోగుల ఆది, గోగుల వెంకట్, హుస్సేన్, గుండ్ల బేబీరాణి, తుపాకుల లక్ష్మీ నారాయణ, అంజయ్య షేక్ దస్తగిరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

రైతుల మోటార్లకు దొంగల బెడద..!

చీకట్లోనే చోరీలు.. అన్నదాతలకు కన్నీళ్లే మిగులు

ప్రజాపక్షం/చింతకాని : మండలంలోని చిన్నమండవ, సీతంపేట గ్రామాల్లో గత రెండు రోజులుగా వ్యవసాయ మోటార్లు వరుసగా చోరీకీ గురవుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు సాగుచేస్తున్న రైతులకు మోటార్ల దొంగతనాలు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. పంటలకు నీరందించేందుకు పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిసుడటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు , పెట్టుబడి భారంతో సతమతమవుతున్న రైతులకు ఈ దొంగతనాలు మరో పిడుగులా మారాయి. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన మోటార్లు రాత్రికి రాత్రే మాయమవుతుండటంతో తిరిగి కొత్త మోటార్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మోటార్లు లేక పంటలకు సకాలంలో నీరందించలేక దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి మోటార్ల దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేసి తొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చిన్నమండవ గ్రామంలో ఆదివారం 5 మోటార్లు చోరీకి గురికాగా సీతంపేటలో సోమవారం 2 మోటార్లు చోరీకి గురయ్యాయి. ఈ విషయమై భాదిత రైతులు సోమవారం చింతకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముదిగొండ తహసీల్దార్‌గా బాబ్జీ ప్రసాద్



ప్రజాపక్షం/ముదిగొండ: ముదిగొండ మండల నూతన తహసీల్దార్‌గా బాబ్జీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బోనకల్ మండలంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ముదిగొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ముదిగొండ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రవి కుమార్ సత్తుపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాబ్జీ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయ సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, భూసమస్యలు, రెవెన్యూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ విద్య, వైద్య సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన



ప్రజాపక్షం/ముదిగొండ: మండల పరిధిలోని వనం వారి కిష్టాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలను జిల్లా కాంగ్రెస్ నాయకుడు మల్లెల అజయ్ సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ముందుగా పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మమేకమై ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం అల్పాహార పథకాన్ని పరిశీలించి, నాణ్యత, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సదుపాయాలపై అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, ఆయాలతో చర్చించారు. వారికేమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన వైద్య సదుపాయాలు, ఇతర సమస్యలను తమకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యసేవల కోసం వల్లభి, ముదిగొండ ఆసుపత్రులకు వెళ్లాల్సి రావడంతో దూరభారం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై సానుకూల స్పందన వచ్చిందని, త్వరలోనే వనం వారి కిష్టాపురంలో పది పడకల ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పర్లకోల సరళ రవీందర్, ఉప సర్పంచి పొదిలి గోపిచంద్, పంచాయతీ కార్యదర్శి మోరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-ప్రజావాణిలో కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెంకు చెందిన కె. రవీంద్రబాబు సర్వే నెం.230లో ఉన్న భూమిని సర్వే చేసి రికార్డు మార్పు చేయాలని దరఖాస్తు చేశారు. ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం తురకగూడెం సర్పంచ్ బుర్రా కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించారని దురదృష్టవశాత్తు ఆ కుటుంబ సభ్యులంతా మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కుదారులు ఉంటే పరిశీలించాలని లేకపోతే మరో లబ్ధిదారుని ఎంపిక చేసి పంపిణీ చేయాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన ప్రజలు, మత్స్యశాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్, డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ. 18వేలు వేతనం అమలు చేయాలి

-రిటైర్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి
-కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన





ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు నెలకు రూ. 18వేల వేతనం అమలు చేయాలని ఏఐటియుసి డిమాండ్ చేసింది. ఏఐటియుసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ. 18వేల వేతనం, రూ.10వేలు పింఛన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే ప్రీ ప్రైమరీ స్కూల్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇబ్బందికరంగా మారిన బిఎల్‌వో విధులను అదనపు పనులను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న రిటైర్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మెనూ ఛార్జీలను పెంచాలని నర్సింహారావు డిమాండ్ చేశారు. సరుకుల టెండర్లను రద్దు చేసి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులే సరుకులు కొనుగోలు చేసి బిల్లులు చెల్లించేవిధానాన్ని అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులతో పాటు రూ. 25 లక్షల ప్రమాద బీమా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా అద్దెలు చెల్లించాలని, సెలవుల ప్రకటనను సవరించాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సిహెచ్ సీతామహాలక్ష్మి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు గాదె లక్ష్మి నారాయణ , అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ ఝాన్సీ, ఎస్‌కె హస్నాబీ, బాధ్యులు శ్రీదేవి, ఆదిలక్ష్మి , కె. లక్ష్మి , తారా, అమృత, ఝాన్సీ, జ్యోతి, నిర్మల, మంగమ్మ, రేణుక, జానకి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ఇరువైపులా సమానంగా చేపట్టాలి

-తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల



ప్రజాపక్షం/బోనకల్: ముష్టికుంట్ల, గార్లపాడు రోడ్డు విస్తరణ పనులు ఇరువైపులా సమానంగా చేపట్టాలని తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ముష్టికుంట్ల, గార్లపాడు రోడ్డు పనులను సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులను కలిసి, పనుల వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జక్కుల రామారావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరుతో ఏ ఒక్క రైతుకు నష్టం వాటిల్లకుండా, ఇరువైపులా సమాన కొలతలో పనులు చేపట్టాలని అధికారులను కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర పరిశీలన జరిపి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, సిపిఎం నాయకులు షేక్ నజీర్, డిహెచ్‌పిఎస్ నాయకులు కాకాటి కరుణాకర్, రైతులు షేక్ ఫయాజ్, రజబ్‌అలీ, గాయాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం ఃఃః

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయండి

- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/పాల్వంచ : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని దానికి సిపిఐ అండగా ఉంటుందని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న నిరధిక సమ్మె శిబిరాన్ని సోమవారం సంధర్శించి తమ సంఘీభాన్ని ప్రకటించారు. ఈ సంధర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కరోనా లాంటి కష్ట కాలంలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేశారని గుర్తు చేశారు. తక్కువ వేతనాలతో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా ఎంతమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వారి శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. 78 కేడర్ల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులదరిని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనాలతో కూడి ప్రసూతి సెలవులు ఇవ్వక పోవటం దారుణమని మండిపడ్డారు.ఆరోగ్యశాఖలో పని చేస్తున్న వారికి ఇన్సూరెన్స్ లేకపోవటం శోచనీయమని ప్రభుత్వం స్పందించి ఇన్సూరెన్ కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చెశారు. 1195 జీఓ వలన తగ్గిన వేతనాలను సవరించాలని, అన్ని కేడర్లకు న్యాయం జరిగేటట్లు పెంచిన జీతాలలో ఎటువంటి మార్పులు లేకుండా నూతన జోవో అమలు చేయాలన్నారు.మీ సమస్యలు పరిష్కారం అయ్యే దాకా పోరాటం చేయాలని మీకు సిపిఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాంబశివ రావు, కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల బడ్డీల తొలగింపు

అధికారుల తీరుపై బాధితుల ఆగ్రహం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : రెక్కాడితే గానీ డొక్కాడని చిరు వ్యాపారుల జీవనోపాధిపై అధికారుల జేసీబీ పడింది. ఏళ్ల తరబడి రహదారి పక్కన చిన్నచిన్న బడ్డీలు ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న వ్యాపారుల దుకాణాలను అధికారులు సోమవారం బలవంతంగా తొలగించారు. మండల కేంద్రం లోని ఎస్సీ, బీసీ కాలనీల పరిధిలో జరిగిన ఈ చర్యతో చిరు వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ కోసం చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై అధికారులు కనికరం లేకుండా వ్యవహరించారని బాధితులు మండిపడ్డారు. పోలీసుల పహారా మధ్య జేసీబీతో దుకాణాలను తొలగించి తమ బతుకుదెరువును దెబ్బతీశారని వాపోయారు. తమ దుకాణాల వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను వివరణ కోరగా.. చిరు వ్యాపారులకు ముందుగానే నోటీసులు జారీ చేశామని, అయినా వారు స్పందించకపోవడంతో దుకాణాలను తొలగించాల్సి వచ్చిందని తెలిపారు.



కాకర్ల గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ సహకారంతో ప్రారంభం



ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల పరిధిలోని కాకర్ల గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వారి సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. దాతలు, కోరమండల్ కంపెనీ వారి సహకారంతో ఈ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టగా, అతి త్వరలో ప్రారంభోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకర్ల గ్రామంలోని సాయి మహాలక్ష్మి ట్రేడర్స్ ప్రొప్రైటర్ కళ్యాణపు ప్రసాద్ చేసిన విజ్ఞప్తి మేరకు కోరమండల్ ఫెర్టిలైజర్ కంపెనీ వారు కాకర్ల గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ఉపయోగకరమైన సేవా కార్యక్రమానికి కృషి చేసిన కళ్యాణపు ప్రసాద్‌తో పాటు సహకారం అందించిన కోరమండల్ ఫెర్టిలైజర్ కంపెనీ యాజమాన్యానికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు లభించనుంది.



విప్లవోద్యమ అమరులకు నివాళులు



ప్రజాపక్షం/ఇల్లందు: భారత విప్లవోద్యమ అమరులను స్మరించుకుంటూ నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న సంస్మరణ సభల వారోత్సవాల్లో భాగంగా ఇల్లందులోని పగడాల వెంకన్న స్థూపం వద్ద నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాయం వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, సహాయ కార్యదర్శి బానోతు రామ్‌సింగ్ పాల్గొని పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

మంచి ఫిట్‌మెంట్‌తో త్వరలోనే పీఆర్‌సి సాధిస్తాం



ప్రజాపక్షం/కారేపల్లి: మంచి ఫిట్‌మెంట్‌తో త్వరలోనే పీఆర్‌సీ సాధిస్తామని ఖమ్మం జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు కట్టా శేఖర్ రావు తెలిపారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సింగరేణి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులంతా ఎంఎల్‌సీ ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. మండల శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాడాన్ని అభినందించారు. పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్ ఎంఎల్‌సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ఆయనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎంఎల్‌సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కారేపల్లి మండల అధ్యక్షుడు బానోత్ నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వేణుమాధవరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి విజయ అమృత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర సోమ్లా, జిల్లా కార్యదర్శి వి విజయలక్ష్మీ, కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాల్మన్ రాజ్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటాం



ప్రజాపక్షం/పాల్వంచ : వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన పాల్వంచ హెచ్‌పి గ్యాసు మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని ఎంఎల్‌పి కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక నవభారత్‌లోని లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ నుండి అందాల్సిన సహాయ సహకారాలు, సంక్షేమ పథకాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కేసు పురోగతిపై ఎస్‌పి రోహిత్‌రాజుకు ఫోన్ చేసి ఆరా తీశారు. కేసు విచారణ వేగవంతం చేసి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కార్పోరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, గుర్రం వెంకటేశ్వర్లు, బాలునాయక్, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, దినేష్, పద్మశాలి సంఘం నాయకులు గుండు రవికుమార్, ఉదయ్, కన్నయ్య, బొమ్మ రామకిషోర్ తదితరులున్నారు.

అమరుల ఆశయానికై పోరాడుదాం



ప్రజాపక్షం/గుండాల : భూమికోసం, భుక్తి కోసం పేదప్రజల విముక్తికోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల ఆశయ సాధనకై పోరాడాలని న్యూడెమోక్రసి పార్టి మండల కార్యదర్శి , సర్పంచి కోరం సీతారాములు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రోల్లగడ్డ, నర్సాపురం గ్రామాల్లో అమరుడు లింగన్న, బోడ వీరు స్తూపాల వద్ద ఎర్రజెండాలను ఎగురవేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ ఉమ్మడి గుండాల మండలంలో అమరులు బాటన్న, లింగన్న, నాయకత్వంలో పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం, నేటి రేవంతు రెడ్డి ప్రభుత్వాలు ప్రజలకు ఒరగ పెట్టింది లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమన్నారు. కార్యక్రమంలో ఈసం క్రిష్ణ, గడ్డం లాలయ్య, ఎల్లన్న, బానోత్‌లాలు, భూక్యవేణు, బోడ రాము, రమేష్, పొట్టెయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/గుండాల : అమరుల త్యాగాలు విప్లవోద్యమంలో చిరస్మరనీయమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టి డివిజన్ కమిటి కార్యదర్శి ఈసం శంకర్ అన్నారు. సోమవారం అమర వీరుల వారోత్సవాల్లో బాగంగా మండల కమిటి ఆధ్వర్యంలో కాచనపల్లి అమరవీరుల స్థూపం వద్ద అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కొమరం శాంతయ్య అధ్యక్షతన ఆ పార్టి జిల్లా నాయకులు మాచర్ల సత్యం , శంకర్‌లు మాట్లాడుతూ అమర వీరులైన కోటన్న, నంబూరి సీతారాములు, నుసేనా, పరుషరాములు, చింతా లక్ష్మక్కల త్యాగాలు ఈ ప్రాంత ప్రజాపోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వప్రైవేటికరణవిదానాలు , నిరుద్యోగం , ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలు అయిక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తెల్లం రాజు, కల్తి రామయ్య, పూనెం లక్ష్మయ్య, కల్తి పాపయ్య, కిషిం దరావు, భరత్, సమ్మయ్య, రియాజ్, పూనెం మంగయ్య, సనప కోటయ్య లు పాల్గొన్నారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన వాహనం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రమాదవశాత్తు ఓ వాహనం పంట కాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కూసుమంచి మండల కేంద్రం కు చెందిన ఐస్ క్రీమ్ వాహనం నేలకొండపల్లి కి వస్తుండుగా మండలం లోని కోనాయిగూడెం వద్ద కు రాగానే మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు పంట కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ కు స్వల్ప గాయాలైయ్యాయి. వాహనం ను స్థానికులు తాళ్లతో బయటకు లాగారు.

తాలిపేరు కాలువలు, 226 చెరువుల్లో పూడికతీతకు ప్రాధాన్య ఇవ్వాలి

-వీబీజీ రామ్‌జీ పథకం కింద పనులు చేపట్టాలని

సర్పంచులు, కార్యదర్శులకు నీటిపారుదల శాఖ విజ్ఞప్తి

ప్రజాపక్షం/దుమ్ముగూడెం: ఎలనినో పరిస్థితులు, తగినంత వర్షపాతం లేక సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకావం ఉన్నందున వీబీజీ రామ్ జీ పథకం కింద తలిపేరు కాలువ వ్యవస్థలో పూడికతీత పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని దుమ్ముగూడెం నీటిపారుదల శాఖ సహాయ కార్యనిర్వహక ఇంజనీర్(ఏఈఈ)సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులను కోరారు. పాత మారేడుబాక నుంచి రామకృష్ణపురం వరకు తలిపేరు ప్రధాన కాలువలో, రాళ్లగూడెం నుంచి రామకృష్ణపురం, రెడ్డిపాలెం పరిధి వరకు ఉన్న 22 డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడికతీత చేపట్టాలని సూచించారు. అలాగే కాలువ వ్యవస్థ పరిధిలోని 226 చెరువుల్లోనూ పనులకు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పూడిక తొలగిస్తే నీటి ప్రవాహ సామర్థ్యం పెరిగి, చివరి ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. పనుల అమలుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలను నీటిపారుదల శాఖ సిబ్బంది అందిస్తారని పేర్కొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి



-ఇది ప్రకృతి కరువు కాదు కాంగ్రెస్ కరువు
-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని వేగవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇది ప్రకృతి కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థత లేకపోవడం వల్ల వచ్చిన కరువు అని అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం మండలంలో నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి డివిజన్, గ్రామాల్లో నమోదు చేసిన పట్టభద్రుల ఓట్లను కేసిఆర్ ప్రత్యేకంగా డిజైన్ చేయించిన పార్టీ యాప్ ద్వారా మన ఓటర్ల నమోదు వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఓటరు ఐడి కార్డు, మొబైల్ నెంబర్, అప్లికేషన్ ఫారాలు నింపి నమోదు చేయించాలన్నారు. గ్రామాల్లో వేలాది మంది పట్టభద్రులు ఉన్నారని నాయకులు వారి ఇండ్లకు వెళ్లి అర్హులైన పట్టభద్రుల వివరాలు సేకరించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థత లేకపోవడం వల్ల వచ్చిన చేతకానితనపు కరువు అన్నారు. వచ్చే రెండు రోజుల్లో కాంగ్రెస్ వైఫల్యాలు ఇంకా స్పష్టంగా బయటపడతాయన్నారు. ప్రజల మైండ్ సెట్ కూడా మారిపోతుందన్నారు. బిఆర్ఎస్ శ్రేణులంతా అలర్ట్‌గా ఉంటూ రాజకీయ కార్యకలాపాలను నిర్వహించాలన్నారు. పార్టీ ఇచ్చే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, నిరంతరం ప్రజలతో సంబంధాలు కొనసాగించాలన్నారు. పార్టీ బలాన్ని పెంచేందుకు రాబోయే పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో గెలుపుకు ఈ ఓటరు నమోదు అత్యంత కీలకమన్నారు. నాయకులు, కార్యకర్తలు అలసత్వం వహించకుండా గడపగడపలోగా పట్టభద్రుల ఓటర్ల నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని అజయ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు విజయ్‌కుమార్, అజ్మీర వీరునాయక్, మద్దినేని వెంకటరమణ, గుత్తా రవి, నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, దండా జ్యోతిరెడ్డి, కొనకంచి ప్రసాద్, వల్లభనేని రామారావు, మాధంశెట్టి హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, మెంటెం రామారావు, లక్ష్మణ్ నాయక్, యాసా రామారావు, పెంట్యా, శంకర్, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువతను వ్యసనాలకు దూరంగా ఉంచాలి



-కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యువతను పొగాకు, మాదక ద్రవ్యాలు తదితర వ్యసనాలకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 60 రోజుల పాటు పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రచారంలో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాలలో పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, యువత వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. పొగాకు వినియోగం వల్ల గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే మానసిక సామాజిక సమస్యల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. వ్యసనాల నిర్మూలనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి, వ్యసనాలకు బానిసలు కావద్దు జీవితాన్ని ఆనందంగా గడపండి అనే నినాదాలతో యువతలో చైతన్యం తీసుకు రావాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా పొగాకు, మత్తు పదార్థాల వినియోగం నుంచి దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ వివాదంపై కలెక్టర్‌కు సిపిఐ ఫిర్యాదు

- కౌన్సిలర్ల హక్కులకు భంగం కలిగించారంటూ ఆరోపణ
- మున్సిపల్, హౌసింగ్‌శాఖలపై సమగ్ర విచారణకు డిమాండ్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పీవీఆర్‌గార్డెన్‌లో అక్టోబర్ 31వ తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న వివాదంపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు సిపిఐ ఖమ్మంరూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ దివాకర టిఎస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఏదులాపురంమున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరుతో కౌన్సిలర్ల హక్కులకు భంగం కలిగిందని సిపిఐ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అధికారుల వద్ద నుంచి ప్రొసీడింగ్ పత్రాలు తీసుకొని పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఏదులాపురంమున్సిపాలిటీ పర్యవేక్షణ, హౌసింగ్‌శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వివాదానికి సంబంధించిన ఫోటోలు, వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాల క్లిప్పింగులను ఆధారాలుగా సమర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని పార్టీలకు అర్హులైన ప్రజలకు సమానంగా అందాల్సి ఉండగా, ఒకే పార్టీకి చెందిన కార్యకర్తలుగా వ్యవహరిస్తూ ఇతర పార్టీల నాయకులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిపిఐ నాయకులు సమర్పించిన ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్‌రావు, వెంపటి సురేందర్, బానోత్ రాంకోటి, బూర నాగేశ్వరరావు, పగిళ్ల వీరభద్రం, బట్ట బాబు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగినిపై కత్తితో దాడిచేసిన నిందితుడు అరెస్ట్

ప్రజాపక్షం/వైరా: వైరాలోని బ్రాహ్మణపల్లి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిపై కత్తితో దాడికి పాల్పడిన సహోద్యోగి పిల్లి ప్రదీప్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడు పిల్లి ప్రదీప్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు వైరా పట్టణ ఎస్సై పుప్పాల రామారావు తెలిపారు. మహిళా ఉద్యోగిపై కత్తితోదాడికి పాల్పడిన ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని, అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మాజీ ఎంపిటిసి మృతి



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని గుబ్బగుర్తి మాజీ ఎంపిటీసి సబ్యురాలు మోత్కూరి విజయలక్ష్మి అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, టిడిపి నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, కేతినేని హరీష్, చెరుకూరి చలపతిరావు, తాతా సుధాకర్, సూరంపల్లి రామారావు, జీవన్ కుమార్, కోట్ల శ్రీను, బొంతు రాంబాబు, నరసింహారావు, వేణు, సురేందర్, ఇతర నాయకులు పాల్గొని నివాళులర్పించారు. విజయలక్ష్మి భర్త గోపవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు టిడిపి జిల్లా నాయకులుగా పనిచేశారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ముందస్తు అరెస్ట్



ప్రజాపక్షం/కొణిజర్ల : హైదరాబాద్‌లో బిజేపి కేంద్ర హోంమంత్రి కార్యక్రమంలో నిరసన తెలియజేయడానికి వెళుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు స్వర్ణ సుబ్బారావును కొణిజర్ల పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. దీనిని ఆయన ఖండిస్తు రాష్ట్రంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసిన వారందరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసి జేఏసి మండల కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : దమ్మపేట మండల ప్రధాన కేంద్రంలో ఆదివాసి జేఏసి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో జేఏసీ మండల అధ్యక్షుడిగా సోయం మోహన్, ప్రధాన కార్యదర్శిగా తోలేం శ్రీను, ప్రచార కార్యదర్శిగా సున్నం శ్రీను, కారం నాగేంద్రబాబు, కోశాధికారిగా కొరసావీదరాజు, మహిళా కార్యదర్శులుగా పద్దం విజయలక్ష్మి, గడ్డం వెంకటరమణతో పాటు 20మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం చట్టాల కోసం నిరంతరం ఉద్యమిస్తామని చెప్పారు. ఈనెల 12న దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం సీనియర్ జేఏసీ నాయకులు బండారు సూర్యనారాయణ, కొర్సా వెంకటేష్, దొర గడ్డం వెంకటేశ్వరరావు, కుంజా చిన్నబాబు, తాళ్ల దుర్గయ్య, వాసం వెంకటేశ్వరావు, మడకం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాపక్షం/పెనుబల్లి: దీపావళి పండుగ సందర్భంగా మండల పరిధి లోని రామచంద్రపురంలో స్థానిక సర్పంచ్ షేక్ రిజ్వానా, జిల్లా కాంగ్రెస్ నాయకులు కరీముల్లా ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఎంట్రీ ఫీజును 499 రూపాయలకు నిర్ణయించారు. గెలుపులో మొదటి బహుమతి 15000 రూపాయలు రెండో బహుమతి పదివేల రూపాయలుగా కమిటీ నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు 628 15 03172 నెంబర్ ను సంప్రదించవలసిందిగా కమిటీ వారు తెలిపారు. మండలంలోని ఆసక్తిగల క్రికెట్ టీంలు సంప్రదించవలసినదిగా కమిటీ కోరుతుందని నిర్వాహకులు షేక్ కరీముల్లా ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి హైజంప్ పోటీలకు రాఘవేంద్ర ఎంపిక



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని పోస్టాపీస్ రోడ్డులో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కె. రాఘవేంద్ర, సోమవారం కల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్14 హైజంప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థి రాఘవేంద్రతో పాటు పీఈటీ మహర్షిని పాఠశాల ప్రిన్సిపాల్ వై. శేషగిరిరావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

లెంగిక దాడి కేసులో ఐదేళ్లు శిక్ష

ప్రజాపక్షం/మధిర: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. మధిర పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 87/2025 కేసులో నిందితుడు గద్దాల అరవింద్(35) మధిర పట్టణం నివాసి. ఇతనిపై బిఎన్ఎస్ సెక్షన్65(2) ఫోక్సో చట్టం 2012లోని సెక్షన్ 5 ఆర్/డబ్ల్యూ 6 క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నేరం నిరూపితం కావడంతో ఖమ్మం రెండో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి పుల్లభట్ల పొగడ కృష్ణ అర్జున్ నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును రూత్విక్‌సాయి ఏసిపి రెహమాన్ నిర్వహించగా, కోర్టులో కేసు విచారణకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.శరత్‌కుమార్‌రెడ్డి సహకరించారు. భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు, లైజన్ అధికారులు ఎస్సై శ్రీకాంత్, ఆర్.నాగేశ్వరరావు, హోంగార్డ్ అయిబ్, సిబ్బంది సమన్వయంతో కేసు విచారణలో సహకరించారు. ప్రస్తుతం మధిర పట్టణ సిఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది కోర్టు సమన్వయంతో వ్యవహరించారు.

జీవో 58, 59 దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగాలి

-నవంబర్ 15లోగా క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలి
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జీవో నెం. 58, 59 క్రింద అందిన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్‌తో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 15లోగా విచారణ ప్రక్రియ ముగించాలన్నారు. జీవో నెం. 58 ప్రకారం 125 గజాల లోపు ఉచితంగా, అంతకు మించిన స్థలాలను జీవో నెం.59 క్రింద నిర్ణీత రుసుముతో క్రమబద్ధీకరించి పట్టా హక్కులు కల్పిస్తామన్నారు. స్వయంగా ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్న స్థలాలకే క్రమబద్ధీకరణ వర్తిస్తుందని, చిన్న ఇల్లు ఉండి అధిక విస్తీర్ణం క్లెయిమ్ చేసిన చోట క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లు, కాలువలు, సహజ నీటి ప్రవాహ మార్గాల్లోని భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమబద్ధీకరించరాదన్నారు. పరిశీలన పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు, ఖమ్మం అర్బన్, సత్తుపల్లి మండలాల్లో ఎక్కువ దరఖాస్తులు వచ్చినందున ఇద్దరు, ముగ్గురు అధికారులను కేటాయించినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి విచారణ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో భూముల స్వభావం, నాలుగు వైపులా హద్దులు, కొలవడంతో పాటు దరఖాస్తు దారునితో కూడిన ఇంటి ఫోటోలను జీయో కో ఆర్డినేషన్‌తో ప్రత్యేక ఆన్‌లైన్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి లక్ష్యాధికారిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌డిఏ అడిషనల్ పిడి జయశ్రీ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రైతు వేదిక నందు రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన గ్రామ దీపికలకు లఖ్‌పతి దిది పథకం పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపిడి జయశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏపిడి మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా (ఎంటర్ ప్రెన్యూర్స్) ఎదిగేందుకు ప్రభుత్వం అవసరమైన రుణ సదుపాయాలను అందజేస్తుందన్నారు. మహిళలు ఆయా రుణాల ద్వారా స్వయం ఉపాధి పొంది తమ వార్షిక ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆదాయ వివరాలను లోకో (ఎల్‌వోకెవో) అబ్జీక యాప్‌లో నాలుగు త్రైమాసికాల వారీగా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని అందు కోసమే గ్రామ దీపికలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపిఎం దుర్గయ్య మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గ్రామ దీపికలు శిక్షణను సద్వినియోగం చేసుకుని సక్రమంగా యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. శిక్షణలో భాగంగా యాప్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, డిపిఎం ఆంజనేయులు, ఏపిఎం శ్రీనివాస్, తిరుమలరావు, శిక్షకులు దేవ్‌సింగ్, కృష్ణయ్య, సిసిలు, అనిల్, జ్యోతి, సునీత, చందు, రేణుక, నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, చారి, మండల సమాఖ్య అధ్యక్షులు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/మధిర: మధిర ప్రభుత డిగ్రీ కళాశాలలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఆయుర్వేద కన్సల్టెంట్ అనుసూరి శ్రీనివాసరావుచే విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువుతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఒత్తిడిని నిర్వహణ అలవరచుకోవాలని, ధ్యానం, సమయపాలన, క్రమశిక్షణ ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఆయుర్వేద కన్సల్టెంట్ అనుసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పరస్పరం అనుసంధానమై ఉంటాయని వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తగినంత నిద్ర, వ్యాయామం, సానుకూల ఆలోచనా విధానం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేద ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మరో ఆయుర్వేద ఔషధ కోఆర్డినేటర్ పాములపాటి అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, అధ్యాపకులు ఎస్.ఇందిర, పి.సుజాత, వి.నాగరాజు, ఎంవిఎస్.శాస్త్రి, పి.లక్ష్మీ నారాయణ, షేక్ ఇమ్రాన్, పిల్లి నాగేశ్వరరావు, ఎస్.జ్యోతి, పి.శ్రీనివాస్, టి.ఆదర్శ్, ఎస్ఎస్.పృథ్వీరాజ్, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశినేనిపాలెంలో గ్రామసభ



ప్రజాపక్షం/మధిర: దేశినేనిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమా అనురాధ, ఉప సర్పంచ్ శాఖమూడి కృష్ణారావు, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, సామాజిక తనిఖీ అధికారి బద్రు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రమీల, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ గ్రామసభలో వికి–రామ్‌జి పథకం క్రింద 125 రోజుల ఉపాధి హామీ పథకం గురించి గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ పథకం ద్వారా కల్పించే ఉపాధి అవకాశాలు, పనుల గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులకు సంబంధించిన పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించడం జరిగింది.

బీఆర్ఎస్ నుంచి 30కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన 30కుటుంబాలు ఖమ్మంనగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి మంత్రి క్యాంప్‌కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పార్టీ కండువలను కప్పి సాధరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీద ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ దొంతిసర్పు రాంబాబు, మాజీ వార్డు సభ్యుడు చీకటిమళ్ల లక్ష్మీ నారాయణ, గౌడసంఘం నాయకుడు మడికంటి శ్రీను, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రుద్రమధు, ఎస్సీ నాయకుడు పొన్నెకంటి రాంబాబుతో పాటు పలు కుటుంబాలు చేరాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి పొంగులేటి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమయ్యి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు మద్దివీరారెడ్డి, మద్ది కిషోర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్, మద్ది వెంకట్‌రెడ్డి, మందటి వెంకట్‌రెడ్డి, షాబాద్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు : సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. సోమవారం సత్తుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి, పెనుబల్లి మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, రైతులకు విద్యుత్ సరఫరా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన న్యాయపోరాటాన్ని ప్రస్తావిస్తూ ఆ ఘనతను ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడం సరికాదన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 2026 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో గ్రామాల వారీగా అర్హులను గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి రామారావు, బొడ్డు శివ బాబు, మండలపు ప్రభాకర్, చక్కిలాల లక్ష్మణ్ రావు, చక్కిలాల మోహన్ రావు, భాను, కోటగిరి సుధాకర్ బాబు, మండలపు అశోక్, టీవీ రామారావు, చింతల సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ



ప్రజాపక్షం/కల్లూరు: క్రైస్తవ సాంప్రదాయ భాగంలో మరణించిన వ్యక్తుల కోసం ప్రార్థించడం గొప్ప క్రైస్తవ సుగుణంగా భావించి ప్రోత్సహించడం జ్ఞాన స్నానం పొంది మరణించి పోయిన తర్వాత దేవుని సాన్నిధ్యంలో ఉండే అవకాశాన్ని వ్యక్తులను గుర్తించుకొని వారికోసం ప్రార్థించే దినం. ఇంకా పరలోకంలో చేరనిఆత్మల కోసం మనం ప్రార్థిస్తే వారు పరలోకంలో చేరుతారని కతోలిక శ్రీ సభ విశ్వసించి బోధించింది. కనుక ఈనెల ప్రత్యేకంగా మరణించిన వారి కోసం ప్రార్థించాలని కతోలిక మత గురువు వినయ్ కుమార్ రెడ్డి క్రైస్తవులకు బోధించారు .ఈ సందర్భంగా చెన్నారు, ఎర్రబోయినపల్లి, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, టి వెంకటాపురం, గ్రామాలలో మరణించిన వారి కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు సమాధుల స్థలాలలో జరిగాయి. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాలకు చెందిన క్రైస్తవులు యువతీ యువకులు సంఘ పెద్దలు బంధువులు ఉపదేశకులు కన్యాస్త్రీలు,సర్పంచులు, పాల్గొన్నారు.

పిజి కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాపక్షం/ ఖమ్మం : స్థానిక ఎస్ఆర్అండ్‌బిజిఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పిజి అటానమస్ కళాశాలలో వివిధ పిజి కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల ఐదున స్పాట్ అడ్మిషన్లు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అసలు ధృవపత్రాలతో రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు. స్పాట్ ప్రవేశం పొందిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉండదని ఆయన తెలిపారు. ఎంఏ తెలుగు, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, యంకాం కామర్స్, యంయస్సి కెమిస్ట్రి, ఫిజిక్స్, బోటని, జువాలజీ, కంప్యూటర్ సైన్స్‌లో ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పిజి సెట్ రాసిన, రాయని వారు కూడా హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. సంబంధిత డిగ్రీ సర్టిఫికెట్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9666398304 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఖమ్మం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. సంఘ సమావేశం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను భయపెడుతూ పంటలు వేయకుండా చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కరువు చర్యలు చేపట్టకుండా బాధ్యత నుంచి తప్పించుకో చూస్తుందని అచ్చయ్య తెలిపారు. కరువు వల్ల నష్టపోతున్న వారికి పరిహారం ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం సాగుకు అనుకూలమైన విత్తనాలను ప్రభుత్వం అందించాలని, వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, తేజ్ నాయక్, పాశం అప్పారావు, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతన ఎంఈఓగా పవన్ కుమార్



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు నూతన ఇంచార్జ్ ఎంఈఓ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కారేపల్లి మండలం లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా రఘునాథపాలెం మండలం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పనిచేశారు. 10 సంవత్సరాలు పాటు విద్యా శాఖలో పరిపాలనలో అనుభవం ఉన్నదని సమన్వయంగా ఉంటూ ఉపాధ్యాయులకు ప్రజలకు విద్యార్థులకు సేవలు అందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం ఎర్రబోయినపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్నారు. మండలంలోని ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో కార్యాలయ సిబ్బంది ఉపాధ్యాయ సంఘాల వారు స్వాగతం పలికారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

-విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
-ఏఐఎస్ఎఫ్ నేత రామకృష్ణ



ప్రజాపక్షం/ ఖమ్మం : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని రద్దు చేసేంత వరకు ఏఐఎస్ఎఫ్ వివిధ రూపాల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. భారతదేశంలో నూతన విద్యా విధానం పేరుతో విశ్వ విద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన గిరి ప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మత ఎజెండాను విద్యా విధానంలో చొప్పించే ప్రయత్నం జరుగుతుందన్నారు. మరో పక్క ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులను యూనివర్సిటీలలో నియమిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి సరైన రీతిలో నిధులు కేటాయించడం లేదన్నారు. నిధులు లేకుండా భవిష్యత్తు తరాన్ని ఎలా తయారు చేస్తారని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను ప్రస్తుత పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని యూనివర్సిటీలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇబ్బందికర పరిస్థితులను ప్రభుత్వమే సృష్టిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యా రంగ సమస్యల పరిష్కారంలో తాత్సరం చేస్తుందని ఆయన తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకు సమస్యల పరిష్కారానికి కనీస చొరవ చూపడం లేదన్నారు. సంక్షేమ గురుకులాల్లో పరిస్థితి దారుణంగా ఉందని ఈ సమస్యల పరిష్కారానికి ఆందోళన ఒక్కటే మార్గమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బూర మనోజ్, నాయకులు చిన్నంశెట్టి ఆకాష్, నాగులమీరా, మధు, శివ, అభి రాంరెడ్డి, మనోహర్, అమృత, దుర్గ, భవాని పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

-విద్యుత్ పొదుపుపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సూపర్ ఎలీనినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించిపొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ తో కలిసి విద్యుత్ పొదుపుపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం ఎంతో అవసరమని తెలిపారు. ఇండ్లలో, కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆఫ్ చేయాలన్నారు. టివిలను వినియోగించని సమయంలో పూర్తిగా స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. పొదుపు చేసిన విద్యుత్తు ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో సమానమన్నారు. విద్యుత్ ఆదా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడిన వారమవుతామన్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు బిఈఈ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలు, ఇంధన సామర్థ్యం కలిగిన పరికరాలను వినియోగించాలని సూచించారు. వీటి ద్వారా విద్యుత్ వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించడం ద్వారా వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన పర్యావరణాన్ని



కాపాడుకోవచ్చునని తెలిపారు. వేసవిలో ఏసిలను 25 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉంచడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఎనర్జీ సేవింగ్ మోడ్‌ను వినియోగించాలని సూచించారు. విద్యుత్ ఆదాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ దివాకర టిఎస్, ట్రైనీ కలెక్టర్ పారస్‌కుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ప్రజాపక్షం/ఖమ్మం : రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. కూసుమంచి మండలంలోని గంగబండ తండాలో 100 పడకల ఆసుపత్రిని సందర్శిస్తారు. అనంతరం తెల్దారుపల్లిలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. తిరుమలాయపాలెం మండలం గోపాలపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం దమ్మాయిగూడెంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. ఏలువారి గూడెంలో బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. బీరోలు ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేయనున్నారు.

తెలంగాణ గొంతుక గూడ అంజన్న



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ ప్రజల గొంతుకగా గూడ అంజయ్య పాటలు రచించాడని తన కలాన్ని ప్రజా చైతన్యానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రమే వినియోగించాడని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత యస్‌పాల్ తెలిపారు. గూడ అంజయ్య జయంతి సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి, జిల్లా అధ్యక్షులు పాగి వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో యస్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కవిత్వం రాయడం ప్రారంభించిన ఆయన సమాజాన్ని చూసి స్పందించాడని ఆనాటి జీవన పరిస్థితులకు అనుగుణంగా పాటలు రాశాడన్నారు. ఆయన రాసిన 'ఊరు మనదిరా ఈ వాడ మనదిరా' అన్న పాట పదహారు భాషల్లోకి అనువాదమైందన్నారు. గూడ అంజన్న సాహిత్యాన్ని భావి తరాలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని ట్యాంక్ బండ్‌పై గూడ అంజన్న విగ్రహాన్ని ప్రతిష్టించాలని యస్‌పాల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీరభద్రం, ఐలయ్య, సుబ్బారావు, నరేందర్, చిర్రా రవి, శ్రీనివాస్, దేవిరెడ్డి విజయ్, శ్రీను, పమ్మి రవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/బోనకల్: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్లతో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టికి సారించాలన్నారు. పెన్షన్ల పెంపు, ఉపాధి హామీ పథకం సమర్థవంతమైన అమలు, రైతులు సమస్యల పరిష్కారం, పేదలకు సంక్షేమ పథకాల అందజేతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రామారావు, మండల కార్యవర్గ సభ్యులు బొమ్మినేని నాగేశ్వరరావు, నాయకులు గుంపుల జయరాజు, వనమా ఆశోక్, గొల్లపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

నకిలీ విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/ తల్లాడ : వర్షాకాల సీజన్‌లో నకిలీ వరి విత్తనాలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన బిల్లుపాడు గ్రామానికి చెందిన రైతు ఉప్పెర్ల శ్రీను సమస్యను సోమవారం తల్లాడలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు తెలిపారు. రైతు శ్రీను తిరువూరు పట్టణంలోని గణపతి సీడ్స్ విత్తన దుకాణంలో కెఎన్ఎం 1638 వరి వంగడం విత్తనాలను కొనుగోలు చేసి తన పొలంలో సాగు చేసినట్లు తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో ఈ వంగడం ఎకరాకు సుమారు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఈ పంట ద్వారా కనీసం ఐదారు బస్తాల దిగుబడికి కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేస్తూ నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయించే వ్యాపారులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి రాయల రమేష్, ఉప్పెర్ల శ్రీను, సత్యం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ సాధించిన బాల భారతి విద్యార్థులు





ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మంలోని వర్తక సంఘ భవనంలో ఈనెల ఒకటి ఆదివారం నిర్వహించిన 32వ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బాల భారతి విద్యాలయం విద్యార్థులు షేక్ సమీర్, సుధా, సాత్విక్‌లు కటా విభాగంలో స్వర్ణ పతకాన్ని, పూల రోహిత్, కోటగిరి వేదా ర్యన్ వెండి పతకాన్ని, షేక్ అయాన్ రజత పతకాలను సాధించి ప్రతిభ చాటారు. భగవద్గీత పోటీల్లో విశ్వ హిందూ పరిషత్ వారు ఈనెల ఒకటిన నిర్వహించిన శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో స్థానిక బాల భారతి విద్యాలయం విద్యార్థులు రమణా, రాజీ, రాయపాటి రేష్మిత, కటికి హేమాన్వితలు అత్యంత ప్రతిభకనబర్చి నగదు బహుమతి అందుకున్నారు. ఈ పోటీల్లో 774 మంది పాల్గొనగా బాల భారత విద్యాలయం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను కెఎస్ఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, భగవద్గీత కంఠస్థ ఉపాధ్యాయులు సునీత లు అభినందించారు.

సామినేని హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి



ప్రజాపక్షం/ తల్లాడ : సిపిఐఎం తల్లాడ మండల కమిటీ సమావేశం కళ్యాణ కృష్ణయ్య అధ్యక్షతన దొడ్డ కృష్ణయ్య భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ సిపిఐఎం పార్టీ సీనియర్ నాయకుడు సామినేని రామారావు హత్యను నిరసిస్తూ మధిర నియోజక వర్గ శాసన సభ్యులు, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐఎం నాయకులను సిపిఐఎం వారే హత్య చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమైనవని, దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీకి హత్యలతో రాజకీయాలు చేసే ఆలోచన లేదని చెబుతున్న నాయకులు సామినేని రామారావు హత్య జరిగిన వెంటనే చోటు చేసుకున్న పరిణామాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామినేని రామారావు హత్యపై సమగ్ర విచారణ జరిపించి అసలు దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐఎం మండల నాయకులు మోహన్‌రావు, పకీరయ్య, నరేష్, నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, నన్నే సాహెబ్, రాజు, సైదులు, వెంకటనర్సయ్య, దర్గయ్య పాల్గొన్నారు.

భైరవునిపల్లిలో చోరీ

రూ.10 వేల నగదు అపహరణ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని భైరవునిపల్లి గ్రామంలో సోమవారం చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన మల్లెబోయిన శ్రీనివాస్ రావు ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని అత్త, కోడలు ఆసుపత్రి పనిమీద కోదాడకు వెళ్లగా, శ్రీనివాస్ రావు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పనికి వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు, లాకర్లు సైతం పగలగొట్టి ఉండటంతో వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న నేలకొండపల్లి క్రైం టీం ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించింది. సర్పంచ్ కూడా అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

సింగరేణి మత్స్య సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా తురక సాంబయ్య రెండో సారి ఎన్నికయ్యారు. సింగరేణి పెద్ద చెరువు కట్ట వద్ద మైసమ్మ చింతచెట్టు సమీపంలో ఎన్నికల అధికారి జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో 140 మంది సభ్యులు పాల్గొన్నారు. ఉపాధ్యక్షుడిగా తురక కోటేశ్వరరావు, కార్యదర్శిగా చింతల సంపత్, డైరెక్టర్లుగా గిరిపోయిన వెంకన్న, బోళ్ల లచ్చయ్య, తురక రాజు, పేరున గురువులు, తురక లక్ష్మి, గంగారబోయిన జానకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తురక సాంబయ్యకు సభ్యులు అభినందనలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధి, సభ్యుల హక్కుల పరిరక్షణకు నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.